



# ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల "తరంగ్" వార్షికోత్సవ వేడుకలు

**జీ న్యూస్, కరీంనగర్ :** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలని మరియు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ప్రోత్సాహం అందించాలని శ్రీమతి డి.సాధన, చైర్ పర్సన్ LRAT మరియు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, కరీంనగర్ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డితో స్థానిక రేకుర్తి రోడ్ లో గల ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో వేడుకగా నిర్వహించినటువంటి "తరంగ్" పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సమాజం గురించి అవగాహన కల్పించాలని మరియు చక్కటి ప్రణాళికల ద్వారా విజయం సాధించడం లక్ష్యంగా ప్రోత్సాహం అందించడం ద్వారా సమాజంలో సుస్థిర స్థానాన్ని పొందుతారని వారు చెప్పారు తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు కావలసినటువంటి వనరులను సమకూర్చి వారిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ ఉండాలని చెప్పారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వినోదంతో పాటు చదువు పట్ల ఆసక్తి కలుగుతుందని మరియు విజయాలను చాలా సులభంగా సాధించగలుగుతారని వారు తెలుపుతూ క్రమశిక్షణతో పాటు అంకితభావం కలిగినటువంటి విద్యార్థులకు అద్భుతమైన భవిష్యత్తు



ఉండడమే కాకుండా పటిష్టమైన స్థానాలలో ఉంటారని వారు చెప్పారు ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల మాటలను అనుసరించాలని మరియు ఉపాధ్యాయులు బోధించినటువంటి విషయాలను సాధన చేసి ఘనవిజయాలను సొంతం చేసుకోవాలని వారు సూచించారు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నరేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చక్కటి విద్యను అందించడం జరుగుతుందని మరియు వారు వివిధ స్థాయిలలో స్థిరపడడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని మరియు తరగతి గదిలో బోధించిన విషయాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని తద్వారా వాటిలో పట్టు సాధించగలుగుతారని చెప్పారు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని మరియు పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని మరియు నైతిక విలువలను పెంపొందించవలసినటువంటి అవసరం చాలా ఉందని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని ప్రదర్శించినటువంటి పలు అవగాహన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి వార్షిక ప్రణాళికలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత డ్రైవర్‌గా మహేశ్వర్‌కు అవార్డు



- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో గుర్తింపు

**జీ న్యూస్, శంకరపట్నం:**

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు–2026 సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్–1 డిపోకు చెందిన బేడిగ మహేశ్వర్ ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ప్రమాద రహితంగా వాహనం నడిపినందుకు ఆయనకు ఈ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. శంకరపట్నం మండలం నల్ల వెంకయ్యపల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్, రహదారి నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, టీజీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు చేతుల మీదుగా ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. మహేశ్వర్‌ను ఆదర్శంగా తీసుకుని ఇతర డ్రైవర్లు కూడా సురక్షిత డ్రైవింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ అవార్డు సాధించడంపై నల్ల వెంకయ్యపల్లి గ్రామస్థులు, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : సీఐ శ్రీను




**జీ న్యూస్, బెజ్జంకి:**

రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని సిఐ శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో "అరైవ్–అలైవ్" కార్యక్రమం పేరుతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట సీపీ ఆదేశాలు, ఏసీపీ సిద్దిపేట సూచనల మేరకు ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ శ్రీను మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సీట్‌బెల్ట్ వినియోగం అలవాటు చేసుకోవాలని సూచించారు. వేగ నియంత్రణ పాటించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం చేయరాదని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచడమే "అరైవ్–అలైవ్" కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ అవగాహన ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



- మోడల్ స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం
- అవగాహన కల్పించిన స్నేహిత విభాగం

**జీ న్యూస్, శంకరపట్నం:**

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్నేహిత గర్ల్ చైల్డ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్న సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా దుర్వినియోగం పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. స్నేహిత విభాగం ఇంచార్జ్ నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు డ్రాయింగ్, పెయింటింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, నాగమణి, రజిత, వనజ, స్వప్న, జ్యోతి, అనిత, పీఈటీ వాసుదేవ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

మండలంలోని తోటపల్లి, గాగిల్లపూర్, బెజ్జంకి ఎక్స్ రోడ్,పోతారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేసి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.తోటపల్లి లో సొంత ఖర్చులతో బోరు,గాగిల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ 10 లక్షల రూపాయలతో నిర్మాణం,బెజ్జంకి ఎక్స్ రోడ్ లో మహిళా సంఘ భవన నిర్మాణం,పోతారం గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి,నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.పనులను నాణ్యతతో ,వేగంగా పూర్తీ చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పలు గ్రామాల సర్పంచ్ లు,నాయకులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ చట్టంపై దుష్ప్రచారం మానాలి



**జీ న్యూస్, గన్నేరువరం:**

గ్రామీణ కుటుంబాల ఉపాధి, ఆర్థిక భరోసా లక్ష్యంగా రూపొందించిన వీబీ జీ రామ్‌జీ కొత్త చట్టంపై కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీపై దుష్ప్రచారం చేస్తోందని వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ కరివేద మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం గన్నేరువరం మండల కేంద్రంలో వికసిత్ భారత్ గన్నేరువరం మండల కన్వీనర్ పుల్లెల రాము ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అధ్యక్షతన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ వీబీజీ రామ్‌జీ చట్టం–2025పై మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భం గా పుల్లెల రాము మాట్లాడు తూ గతంలో ఉన్న 100 రోజుల పనిని 125 రోజులకు పెంచారని తెలిపారు. సంవత్సరంలో 60 రోజులు సెలవు దినాలుగా ప్రకటించుకునే వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు. గతంలో 15 రోజులు దాటినా వేతనాలు అందని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం పని చేసిన వారం రోజుల్లోనే వేతనాలు ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు. ఈ చట్టంపై బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ కో కన్వీనర్ పుల్లెల జగన్ మోహన్, ఏలేటి చంద్రారెడ్డి, బండ తిరుపతి, గాదె వెంకన్న, కాంతల రాజిరెడ్డి, చొక్కాల లక్ష్మయ్య, మునిగంటి సత్తయ్య, రాముడి కృష్ణమూర్తి, బొమ్మాడి సురేందర్, సందవేణి ప్రశాంత్ యాదవ్, తాడూరి రమణారెడ్డి, మచ్చ మురళి, టేకు అనిల్, కుంభం విష్ణు, దానవేని ప్రశాంత్, జీల ఎల్లయ్య, గూడూరు జగన్ తదితర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీజీ టీమ్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

**మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**జీ న్యూస్, శంకరపట్నం:**

స్థానిక మోడల్ స్కూల్‌లో తెలంగాణ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మోడల్ స్కూల్ (టీజీ టీమ్స్) నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్ కట్కూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయడం, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించడమే సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.




## కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు



**జీ న్యూస్, శంకరపట్నం:** జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కేశవపట్నం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞా న సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పద్మ సాయిశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వీణ ప్రణతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు తమ రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పిల్లల హక్కుల గురించి విద్యార్థినులకు వివరించారు. కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాలికల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

